MANASU FOUNDATION - e Chitrapuri
PM DRF: 1212/018
TITLE: Adivaram vaartha seperate sheets 2001



# ప్రతిమల మంచం

“ఆచారీ! ఓ ఆచారీ!!”

చేస్తోన్న పనిని ఆపి తలెత్తి చూశాడు జానకిరామయ్య.

“రేప్పొద్దునికంతా మంచం రెడ్డోరింట్లో వుండాలంట. మల్లామల్లా సెప్పే దుండదు. ఆ...” కరుగ్గా అంటూ ముందుకు సాగిపోయాడు అతను.

కొద్ది క్షణాలు అతను వెళ్లిన దిశ కేసి తదేకంగా చూసి తలదించుకొన్నాడు జానకిరామయ్య.



సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి

చేస్తోన్న పనిని కొనసాగించే ప్రయత్నంలో ఉలిని చెక్కమీద ఆనించబోయాడుగాని. ఎందుకో చేతులు సహకరించలేదు. మనస్సు వికలమైనట్లుగా అన్పించి అక్కణ్నించి లేచి దొడ్లోకెళ్లాడు.

కొంతసేపు అటుఇటు పచార్లు చేసిన తర్వాత మళ్లీ వచ్చి పనిముందు కూచున్నాడు.

రకరకాల కొయ్యపలకలన్నీ గదినిండా అస్తవ్యస్తంగా పడివున్నాయి. పూర్తి స్వరూపం ఏర్పడకముందే మూలబడిన డైనింగ్ టేబుల్‌లాంటి వస్తువులు గదికి వింతదనాన్నిస్తున్నాయి.

పిల్లలిద్దరూ బడికి వెళ్లటం వలన దొడ్లో తీరిగ్గా ఏదో పన్జేసుకొంటూవుంది శ్రీమతి.

ఇంటిముందు చెట్టుకింది మంచమ్మీద పడుకొని దగ్గుకొంటూనే బీడీ దమ్ము లాగుతున్నాడు ముసలితండ్రి.

తను ఉలిని మోపాల్సిన చెక్కకేసి చూశాడు జానకి.

ఉలి చిత్రించాల్సిన దృశ్యాన్ని గుర్తుకు దెచ్చుకోబోయాడు.

దృశ్యమైతే గుర్తిందిగాని, అందులోని ఏదో మెరుపు జారిపోయి అదృశ్య స్థితిలో తన చుట్టూ తిరుగుతోన్నట్లుగా అన్పించింది అతనికి.

రెడ్డిగారి మనిషి చేసిన హెచ్చరిక అతని మనస్సును ఇంకా కుదుటబడనీయలేదు. మనోవృక్షం మీద ఆలోచనల పక్షులన్నీ పొగమంచులా వాలుతున్నప్పుడు ఎక్కణ్నించో ఓ రాయి వచ్చి కొమ్మలకు తగిలి అక్కడి అపురూప శబ్దచిత్రాన్ని భళ్లున పగిల్చిన అనుభూతిని మిగిల్చింది.

మంచానికి తలాపిన బిగించబోయే అద్దానికి అటుఇటు ఇద్దరు నాట్యగత్తెల బొమ్మల్ని చెక్కేందుకు పకడ్బందీగా వ్యూహాన్ని రచించుకొని వున్నాడు జానకిరామయ్య.

ఇరువైపుల సంప్రదాయ నాట్యభంగిమలో నిల్చుని అద్దాన్ని ఎత్తి పట్టుకొన్నట్లుండాలి ప్రతిమలు రెండూ. అద్దాన్ని ఏ వైపుకైనా వొంచుకొనే అవకాశం వుండాలి. ఆపనేదో నాట్య ప్రతిమలే చేసినట్లుండాలి.

బొమ్మంతా గుర్తుందిగాని, అందులోని జీవనాంశమే ఎక్కడో జారిపోయింది.

దాన్ని వెతుక్కోవాలంటే ఏకాగ్రత వుండాలి.

ఉన్న రవ్వంత ఏకాగ్రతనూ యిప్పుడే ధ్వంసం చేసిపోయారు రెడ్డి మనుషులు.

వాళ్లకు పనిమాత్రమే కావాలి.

కేవలం పని.

డబ్బుకు అమ్ముడుపోయే పని.

పని వెనకున్న హృదయాలు వాళ్లకు అక్కర్లేదు.

పనిని అప్పగించి తర్వాత దానికి పట్టే సమయాన్ని కూడా వాళ్లే లెక్కగట్టి కేటాయించటమనేది భరించరాని విషయంగా వుంటుంది జానకికి.

సమయ స్వేచ్ఛను సైతం కళాకారుని యిష్టానికి వదలివేయటం వాళ్లకు ఎంత మాత్రమూ నచ్చదు.

రెడ్డి మనుషులు ఎన్నిసార్లు తిరిగిపోయారనీ!

ఎన్ని దఫాలుగా హెచ్చరించి వదిలారనీ!

వస్తువు రూపాన్ని గురించిన ఒక ప్రణాళిక మనస్సులో మెదలుతున్నపుడు దాన్ని కాదని ఉలిని కదలించటం సాధ్యంకాని పని.

మధ్యమధ్యన వచ్చి వాళ్లు ఆటంకపరచకుంటే సరి!

తన తపస్సును భంగపరచకుంటే అదే పదివేలు.

మంచి ఏకాగ్రతతో ఉన్నప్పుడు వస్తారు. భావాన్ని చెడగొడతారు. మళ్లీ ఆ ‘మూడ్’లోకి వచ్చేందుకు పట్టే సమయాన్ని గురించి ఏమాత్రం ఆలోచించరు.

వాళ్లకు వస్తువు కావాలి.

యంత్రాల్లా పన్జేసి దాన్ని అందివ్వాలి.

వస్తువు మాత్రం అందంగా వుండాలి- బలంగా వుండాలి.

మరోమాటలో చెప్పాలంటే- అందమైన మొరటుదనంగా వుండాలి- వాళ్ల మీసాల్లాగే.

మంచం దాదాపు పూర్తి కావొచ్చింది.

అరకొరకగా వున్న పని రాత్రికి పూర్తవుతుంది. వాళ్లొచ్చి చీకాకు పరచకుంటే.

వాళ్ల వత్తిడి ఎక్కువయ్యే కొద్దీ పని యింకా ఆలస్యమవుతూనేవుంది.

అందరిలాగా మూసపద్ధతిలో వస్తువును చెక్కటం తనకు నచ్చని పని.

నాట్యగత్తెల రూపాల్ని పెన్సిల్‌తో స్కెచ్ గీశాడు.

వాటిముందు తదేకంగా కూచుంటేసరి!

ఇప్పుడనిపిస్తూవుంది- అంతటితో వదిలేసినా పెద్ద నష్టం వుండదని.

రెడ్డి తన్నేమీ అడగలేదు- అద్దాన్ని నాట్యగత్తెలచేత ఎత్తి పట్టించమనీ, సరికొత్త భంగిమలో సృజించమనీ. నగరానికెళ్లే మంచం కాబట్టి నాజూగ్గా చేద్దామనుకొన్నాడు తనే. తనలోని కళాతృష్ణనంతా అందులో ప్రతిబింబించేలా చేద్దామనుకొన్నాడు.

లేకలేక పుట్టిన కూతురికి మొన్న శ్రావణమాసంలో ఘనంగా పెళ్లి జేశాడు పెద్దిరెడ్డి.

అల్లుడు కర్నూలులో ఇంజనీరట.

కూతుర్ని కాపురానికి పంపేటప్పుడు ఆమెతోటి ఎగుమతి చేయాల్సిన అరణపు వస్తువుల జాబితాలో మంచం కూడా వుండటం వల్లా, ఆమె ప్రయాణం రేపే కావటం వల్లా- జానకిరామయ్య గొంతు మీదకొచ్చి కూకున్నట్లయింది.

బొమ్మల్ని చిత్రించకుండా వదలివేద్దామనే ఆలోచన వచ్చింతర్వాత కొంత వూపిరి పీల్చుకొన్నట్లుగా అన్పించింది అతనికి.

మధ్యాహ్నం దాకా మంచాన్ని బిగిస్తూ కూచున్నాడు.

సింహపు పంజాల ఆకారంతో వున్న నాలుగు కాళ్లు చాలా గాంభీర్యాన్నిస్తున్నాయి.

అట్లాంటి మంచం తమకొకటి వుంటే బావుంటుందనే అభిప్రాయాన్ని అప్పుడప్పుడూ వెలిబుచ్చుతూ వుంటుంది తన ఇల్లాలు

ఎన్నో పట్టె మంచాల్ని నగిషీలు చెక్కి, గిలకలు బిగించి అద్భుతంగా చేసి వుంటాడు తను.

ఇంట్లో మాత్రం తాతలకాలంనాటి గుండు పట్టెల మంచాలమీద పడుకొంటారు.

నగిషీ మంచాల మీద పడుకోటానికి స్తోమత ఉండాలిగదా!

కుమ్మరోల్లకు కుండలు కరువు.

మాదిగోల్లకు చెప్పులు కరువన్నట్లు- ఆచార్లకు మంచాలూ కరువే.

తాను అప్పటికీ చెబుతూ వుంటాడు శ్రీమతితో- ‘పట్టెమంచం మీద పడుకోవాలనే తపన పట్టలేకుంటే- ఎప్పుడూ యింట్లో ఏదొక మంచం తయారవుతూనే వుంటుంది కాబట్టి ఆ మంచాలమీద పడుకొని, కోరిక దీర్చుకో’మని.

బడినించి పిల్లలొచ్చారు.

భోంచేయగానే పలకల్లో ఎక్కాలు రాయటం ప్రారంభించారు.

కొంతసేపయింతర్వాత ముసలాయన ఇంట్లోకొచ్చాడు.

మంచానికి మెరుగులు దిద్దుతోన్న కొడుకుకేసి తదేకంగా చూస్తూ బీడీ ముట్టించుకొని బైటకెళ్లాడు.

మధ్యాహ్నం భోంచేసిం తర్వాత టీచర్



1

నారాయణరెడ్డి వచ్చాడు- డైనింగ్ టేబుల్ విషయం ఏమైందని నిలదీసేందుకు.

అతనికి సమాధానం చెప్పేసరికి తల ప్రాణం తోకకొచ్చింది.

మరోగంట తర్వాత సాక్షాత్తూ పెద్దరెడ్డే వచ్చాడు.

"పైకి రావాల్సిన కుర్రాడివి- యిట్లా డిలే చేస్తే ఎట్లా?" అన్నాడు.

"చెప్పిన టయానికి వస్తువును డెలివరీ చేయటం నేర్చుకో"మన్నాడు.

రెడ్ల విషయంలో కొంత జాగ్రత్తప డ'ంటూ హెచ్చరించాడు.

మంచాన్ని పరీక్షగా చూసి "అయిపోయి నట్టుందే!" అన్నాడు.

వినయంగా నిల్చుని తలూపటం తప్ప మారుమాట అందివ్వలేదు జానకి రామయ్య.

పెద్దరెడ్డి అక్కణ్నించి నిష్క్రమించగానే జానకి తండ్రి ఇంట్లోకి వచ్చాడు చిన్నగా దగ్గుకొంటూ.

"ఇయ్యన్నీ పెద్దరెడ్డి గారి పనుల్నాయినా! వొల్లు బలిసినోల్ల పనులు. లెక్క జాస్తియి సేయించుకొనే పస్లు. నువ్వు వీటెనే నమ్ముకొన్నెవుగాని... యిందులో లెక్కదప్ప మనస్సుకు తృప్తి వుండదురా సిన్నోడా!" చెప్పాడు.

తలెత్తి తండ్రికేసి చూశాడు జానకి.

"రైతు పన్జెయ్యినాయినా! గొర్రోగుంటకో నాగేలో కట్టియ్యి. పదికాలాలబాటు బూమిని దున్నుతయి. పదిమందికి కూడు బెడ్తయి."

తండ్రి గొంతులో ఏదో ఆర్ద్రత.

"రైతులకు కొరముట్లు జేయిస్తే నువ్వు పనిమంతుడయిన ఆచారిగా మిగిలి గౌర వించబడ్తావు. పెద్దరెడ్లకు ఎంత మంచి నగిషీలు చెక్కిన వస్తువుల్ని తయారుచేసి యిచ్చినా పనితనాన్ని డబ్బుకు అమ్ముకొనే వృత్తి పనివారిగానే గుర్తింబడ్తారు. ఏరోజుకైనా మనకు రైతుపనే సరైంది నాయినా!"

అవన్నీ తనకు తెలిసిన సంగతులేనన్నట్లుగా చూశాడు జానకి.

"సరె సరేలే!... మీ కాలంగాదులే యిది..." ఒక్క మాటతో కొట్టేసి మంచం పైకి దృష్టి సారించాడు. దానికి తుది మెరుగులు దిద్దసాగాడు.

ముసలాయన నిర్వేదంగా చూడటం తప్ప ఏమీ అనలేకపోయాడు. నిజమే! తమకాలం కాదు యిది.

తమలా రైతులవద్ద దేబిరించి బతక్కూడదనే- కొడుక్కి విలాసవస్తువుల్ని తయారుచేయటం నేర్పించాడు తను.

ఇప్పుడు మాత్రం మానసిక తృప్తికోసం దేబిరించాల్సి వస్తోంది.

తన కొడుకు కూడా బతుకుదెరువు ప్రశ్నార్థకంగా కన్పించే యీ వడ్రంగి వృత్తి నించి తప్పించాలనే- వాని పిల్లల్ని కాన్వెంటుల్లో వదిలింది. తరానికి తరానికి మధ్య వచ్చే మార్పులకు ప్రేక్షకపాత్ర వహించాల్సిందే. మెల్లిగా బైటకెళ్లాడు ఆయన.

మంచంకేసి చూస్తూవుంటే ఏదో సమగ్రత లోపించినట్లే మనస్సులో పీకుతూ వుంది జానకికి.

నాట్య ప్రతిమల్ని దిద్దితే దానికి పరిపూర్ణత వస్తుంది.

పనిలో కొరతలు తనకు బొత్తిగా నచ్చవు. అట్లాగని పూర్తి చేసేందుకు సమయం లేదు.

పూర్తి చేసేంత అవసరం కూడా తనకు కన్పించలేదు.

తనపట్లా, తన పనిపట్లా. తన వృత్తి పట్లా గౌరవాన్ని చూపలేని వాళ్లకు- చులకన భావాన్నీ, ధిక్కారతనాన్నీ ప్రదర్శించే వాళ్లకు పూర్తి న్యాయం చేయకపోవటం తప్పేమీ కాదు.

ఓవైపు ఆలోచనలు- మరోవైపు అలవాటైన నైపుణ్యాలు.

చకచకా సాగిపోతూ వుంది కాలాన్నీద్చుకొంటూ పని.

ఇంటిబైట మోటార్ బైకు శబ్దమైంది. బుల్లెట్ లాగుంది.

వెంటనే అర్థమైంది- వచ్చింది ఎవరో!

పోరుమామిళ్ల ఎస్సై. ఊగే కుర్చీకి ఆర్డరిచ్చి వున్నాడు.

"రాండి సార్! రాండి... రాండి..." ఆహ్వానించాడు.

చిన్న స్టూలునొకదాన్ని ఆయన ముందు వుంచాడు.

తనకోసం తయారుచేయబోయే కుర్చీకి వాడవలసిన కర్రగురించి చెప్పాడు ఎస్సై. ఫలానా కర్రతో మాత్రమే తన వస్తువు తయారుచేయమని హుకుం జారీచేశాడు.

ఆమాట చెప్పేందుకే వచ్చాడుట.

అతని అభిప్రాయాన్ని మార్చేందుకు నచ్చుజెప్పబోయాడు జానకి.

తను చెప్పినట్లే చేయమంటూ అక్కణ్నించి లేచాడు ఎస్సై.

జానకిరామయ్యకు చాలాబాధకలిగింది.

ప్రతి వస్తువుకూ విలువైన కులంగా చెలామణి అయ్యే కర్రనే వాడమంటారు.

కర్రను ఎంచుకొనే స్వేచ్ఛను కూడా తమకివ్వరు.

కర్రలోని లొంగుబాటుదనాన్నీ, దానిలోని ఔషదగుణాల్నీ బట్టి ఏవస్తువుకు ఏ కర్రవాడాలో తమకు బాగా తెలుసు.

వాళ్లకై వాళ్లు అవగాహనకు రారు.

చెప్పినా తెలిసికోరు.

ఈ విషయంలో పల్లెటూరి రైతులు ఎంతో నయం.

రోకలికి ఉపయోగించే కర్రతో తెడ్డును చేయమని చెప్పరు.

నాగలికి వాడేకర్రతో కాడిమాను తయారుచేయమని వాదించరు.

పప్పుగుత్తికి వాడే కర్రను కవ్వానికి వినియోగించమనరు.

మనస్సంతా సన్నసన్నని గాయాలతో చెదలు పట్టిన పుడకలా తయారైంది అతనికి.

మరోసారి రెడ్డిగారి మనిషి వచ్చి హెచ్చరించి వెళ్లాడు.

> తానెంతో ముచ్చటపడి వూహించుకొన్న దృశ్యాన్ని వస్తువుపై చిత్రించలేకపోయిన తన అసమర్థత మెదడులో యింకా కరిగిపోలేదు.

జానకి ఒళ్లంతా అసహనంతో వణికిపోయింది.

వాళ్ల చులకన భావాన్ని భరించే తనచేతగాని తనంపైన జాలి కూడా కలిగింది.

కొరముట్లు పక్కన పడేసి విసురుగాలేచాడు.

బస్టాఫ్ దాకా వెళ్లి టీబంకుల వద్ద రెండు టీలు తాగినా మనస్సు కుదుటపడలేదు.

రెడ్డిగారి మనుషుల అదిలింపులు హృదయంలోంచి ఇంకా జారిపోలేదు.

తానెంతో ముచ్చటపడి వూహించుకొన్న దృశ్యాన్ని వస్తువుపై చిత్రించలేకపోయిన తన అసమర్థత మెదడులో యింకా కరిగిపోలేదు.

పిచ్చయ్య బంక్‌లో పాత వారపత్రిక ఒకటి కన్పిస్తే తిరగేస్తూ కూచున్నాడు.


అందులో ఓ కథ అతన్ని ఆకట్టుకొంది.

సీమ ప్రాంతపు కరువు, ఫ్యాక్షన్ సమస్యల మీద రాసిన కథ.

కథనం బావుందిగాని ముగింపు ఎందుకో పేలవంగా అన్పించింది. కృత్రిమంగా తోచింది. సహజంగా జరిగినట్లు కాకుండా రచయిత తన ఇష్టానికి మలచుకొన్నట్లుగా అర్థమైంది.

అక్కణ్నించి లేచాడు.

కొంతసేపు టివిలోంచి వచ్చే పాటల్ని విన్నాడు.




ఎదురైనవాళ్లతో మాటల్ని కలిపాడు.

వీధిలైట్లు వెలిగేదాకా అక్కడక్కడే తచ్చాడాడు.

ఇంటికెళ్లేసరికి పంచలో కూచుని చదుకొంటూ కన్పించారు పిల్లలు. వెళ్లి వాళ్ల పక్క కూచున్నాడు.

రెడ్డిగారి మనుషులు మళ్లీ రాలేదు కాబోలు.

వస్తే మంచం తయారైందనీ, తీసికెళ్లమనీ చెప్పాలి.

"నాన్నా! నాన్నా! సారు నాకీరోజు ప్రైజిచ్చిండు" చెప్పింది పాప.

"ఏం ప్రైజమ్మా?"

"పేనా!" చూపించింది.

"ఎందుకూ?"

"నీట్‌నెస్‌గా వున్నెందుకు. అందరికంటే శుభ్రంగా నేనేగదా వెళ్లేది?"

"ఏంకాదు. నేనే శుభ్రంగా వుంటా" చెప్పాడు బాబు. "ప్రైజులిచ్చేది మీసారుగా బట్టి నీకిచ్చిండు" బుంగమూతి పెట్టాడు.

"బో శుభ్రంలే. ఎప్పుడూ చీమిడి ముక్కులు" గేళిచేసింది పాప.

"నీదే సింపిరి జుట్టు...." ఉడుక్కున్నాడు.

నవ్వొచ్చింది జానకిరామయ్యకు. "నీకు నేనిస్తాగదా ప్రైజు" కొడుకును సముదాయించాడు.

తర్వాత ఎందుకో అతనికో అనుమానం వచ్చింది.

పాపకు ప్రైజిచ్చింది రమణారెడ్డి సారేగదా!

అదెట్లా సాధ్యమైంది?

మొన్ననేగదా అతనూ, తనూ కొట్లాడింది.

కొంత అవగాహనా రాహిత్యం వల్ల తమమధ్య అభిప్రాయ భేదాలొచ్చాయి. అందులో తన పొరబాటు పాళ్లే ఎక్కువున్నాయి. అతన్ని అనవసరంగా అపార్థం చేసికొన్నాడు.

ఇది జరిగి రెండ్రోజులు కూడా కాలేదు.

అతనికి తనపైన కోపపు వేడి ఏమాత్రం తగ్గేదానికి అవకాశంలేదు.

మరి! అతనెట్లా తన కూతుర్కికి ప్రైజిచ్చాడు?

మార్కుల్నిబట్టి కాకుండా ఉపాధ్యాయుని అభిప్రాయాన్ని బట్టి ఇచ్చే బహుమతిగదా యిది! తన కుమార్తెగా తెలిసీ ఆమెకు బహుమతి ఇవ్వటం విడ్డూరంగా వుంది.

భోజనాల ముందు యీ సందేహాన్నే భార్య వద్ద వెలిబుచ్చాడు.

"ఆయనకూ నీకూ కాకుంటే నడిమధ్యన పిల్లోల్లేంజేసిన్రు?" అంది.

"మనకు కానోల్లయితే మాత్రం ఒక వస్తువును మంచిగా జేస్తే దాన్ని నువ్వు బాగుందెనవూ! వాల్లు సరిపోలేదని వస్తువునూ సరిపోనెట్లు జూస్తవా?"

ఆమె వివరణ సబబుగా అన్పించింది అతనికి.

మంచమ్మీద పడుకొన్న తర్వాత కూడా పాపకిచ్చిన ప్రైజే గుర్తుకొచ్చింది.

భార్య చేసిన ఒక చిన్న విశ్లేషణ అతని మనస్సునిండా విస్తృతం కాజొచ్చింది.

ఈ సాయంత్రమే రెండు దృశ్యాలు ఎదురయ్యాయి.

ఇట్లాంటివి ప్రతిరోజూ తటస్థపడుతూ వుండొచ్చుగానీ, తానో సమస్య ఎదుర్కోబో తున్నప్పుడు వాటి ప్రాముఖ్యత అర్థమైంది.

సహజత్వానికి భిన్నంగా తనకిష్టమైన రీతిలో కృత్రిమమైన ముగింపునిచ్చిన రచయితా, పొరబాటున కూడా కృత్రిమ ప్రవర్తన అంటకుండా అత్యంత సహజంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడూ అతని రెండు కళ్లముందు నిల్చుండిపోయారు.

చాలాసేపు తపస్సులో మునిగిన తర్వాత అతనో అవగాహనకు వచ్చాడు- కళ అనేది మనుషుల మధ్యన జుగుప్సాకరంగా ప్రవహించే అరిషడ్వార్గాలకు అతీతంగా వుండాలని. రాగద్వేషాలకు దూరంగా వుండాలి.

లేచి వెళ్లి పట్టె మంచం ముందు కూచున్నాడు.

చాలాసేపు మథన పడింతర్వాత ఓ నిర్ణయానికి వచ్చాడు.

రెడ్డి మనుషులు తన పట్ల ఎంత అనుచితంగా అయినా ప్రవర్తించనీ, తను మాత్రం కళకు ద్రోహం చేయటం క్షమించరాని విషయంగా భావించాడు.

వెంటనే ఉలి అందుకొన్నాడు.

తెల్లారేసరికి అతని కళ్లు చింతనిప్పుల్లా ఎర్రగా తయారయ్యాయి. అలసట వల్ల కండరాలన్నీ బాధను వ్యక్తపరచసాగాయి. అద్దానికి ఇరువైపుల జీవం పోసుకొన్న ప్రతిమలు మాత్రం అతని గుండెల్లో వ్యక్తీకరించని ఆనందతరంగాలను సృష్టించసాగాయి.

పొద్దుపొడిచేసరికి రెడ్డిగారి యింటి నుంచి మనుషులొచ్చారు.

మంచాన్ని ఎత్తుకెళ్లారు.

వాళ్లవెంట జానకి కూడా కదిలాడు.

అతనికి కాఫీ యిచ్చి కూచోబెట్టారు.

కుర్చీలో హుందాగా కూచుని కాఫీ తాగుతూ మంచాన్ని అల్లునికి చూపించాడు పెద్దరెడ్డి.

"బావుంది" మెచ్చుకొన్నాడు అతను. "అందంగావుంది. స్ట్రాంగ్‌గా వుంది" అన్నాడు.

"ఇది తయారయ్యేసరికి ఆచారికంటే నేనే జాస్తిగా కష్టపడిన్నేమో! చెలకోల పట్టుకొని కూకుంటేగాని పూర్తిజెయ్యలే..." పెద్దగా నవ్వాడు పెద్దరెడ్డి.

పొలమారినట్లుగా అన్పించింది జానకిరామయ్యకు.

ఇంట్లో వాళ్లంతా వచ్చి మంచాన్ని ఆసక్తిగా చూడసాగారు.

పెద్దరెడ్డి కూతురు మరీ వింతగా చూస్తోంది. గిలకల్ని పట్టి వూపుతోంది. అద్దాన్ని ఎత్తి పట్టుకొన్న ప్రతిమల్ని ఆప్యాయంగా తడువుతోంది. మంచాన్ని తనివిదీరా చూసేసరికి ఆమె బుగ్గల్లో ఎర్రదనం కదలాడింది.

కొంతసేపటికి ఇరుగుపొరుగులు కూడా మూగారు.

అందరూ మంచాన్ని మెచ్చుకొనేవాళ్లే.

"అద్దం పక్కనున్న ప్రతిమలు అద్భుతంగా వున్నాయి" అల్లుని గొంతు తృప్తిగా పలికింది.

"ఆ ఐడియా యిచ్చింది నేనే" చెప్పాడు పెద్దరెడ్డి.

మామకేసి మెచ్చుకోలుగా చూశాడు అతను.

అంతమంచి మంచానికి ఐడియా ఇచ్చి చేయించిన పెద్దరెడ్డిని అందరూ ప్రశంసించసాగారు.

శిలాప్రతిమలా కూచుని చూస్తూండిపోయాడు జానకిరామయ్య. బాధక్కూడా అతీతమైన భావన ఏదో అతని మనస్సునిండా కమ్ముకొని తన ఉనికినే మర్చిపోయేలా చేసింది.

స్థంభాన్ని ఆనుకొని నిల్చుని వున్న నవవధువు బుగ్గల్లో పొట మరించిన ఎర్రదనం శరీరమంతా పాకి కదిలే గులాబి మొగ్గల్లా అక్కణ్నించి జారుకొంది.

"ఆచారీ! డబ్బు రేప్పంపుతా." చెప్పాడు పెద్దరెడ్డి.

"అట్లనే అయ్యా!" లేచాడు అతను. తలొంచుకొని మెల్లిగా గేటుకేసి అడుగులేయసాగాడు.

బాధో, అసహ్యమో, మానసిక న్యూనతో... లేదా అన్ని భావాలూ కలిసి దాడిజేశాయో మరి!... అతను కుంగిపోతూ నడుస్తున్నాడు.

రెడ్డి ప్రవర్తన అతన్నెంతయినా గాయపరిచింది.

వాళ్లకు వస్తువు బావుండాలి.

అందరూ మెచ్చుకొనేంత అందంగా వుండాలి.

దాన్ని తయారుచేసినవాన్నిగాదు, చేయించినవాన్ని మెచ్చుకొనేంత అందంగా వుండాలి... శిల్పిని మరచిపోయేంత అందంగా...

అందరిలా తను వస్తువుల్ని చేయటం మాత్రమే నేర్చుకోవాలి. పనితనాన్ని బహిరంగంగా ప్రదర్శించకూడదు.

పనితనం మీద మరులు పెంచుకోకూడదు.

సృజనాత్మకత మీద వ్యామోహాన్ని వృద్ధి చేసికోకూడదు.

తన పనితనాన్ని వాళ్లు మెచ్చుకోవాలనే రూలేమీ లేదుగదా!

బాధాతప్త హృదయంతో గేట్లోంచి బైట పడుతూ వున్న అతన్ని ఎవరో పిల్చినట్లుగా అన్పించి తల వెనక్కి తిప్పాడు.

"పోతాండవేం నాయినా! యిట్రా!" పెద్దరెడ్డి భార్య.

కొంత తటపటాయించి వెనుదిరిగాడు.

"ఈ మంచాన్ని చూస్తే మా ఫ్రెండ్సంతా తలొకటి కావాలంటారు." చెబుతున్నాడు పెద్దరెడ్డి అల్లుడు.

"కావాలంటే చెప్పి పంపు. మరో నలుగురు ఆచార్లను పిలిపించి యీడనే కూకోబెట్టి వారం తిరక్కుండా సేయిస్తా" పెద్దరెడ్డి హామీ ఇచ్చాడు.

ఒళ్లంతా కారం పూసినట్లు భగ్గున మండింది జానకికి.

తానిన్నేళ్లూ కష్టపడి సాధించిన నైపుణ్యాన్ని అందరు వడ్రంగులలోనూ వుండే సాధారణమైన పనితనంగా చూపిస్తున్నాడు.

వస్తువుల్ని చేయించేందుకు వడ్రంగుల నైపుణ్యంకంటే చేయించేవాడి శ్రద్ధ, బుద్ధికుశలత ప్రధానమైనట్లుగా స్పష్టీకరిస్తున్నాడు.

వెనక్కి తిరిగి వెళ్లిపోదామనిపించింది అతనికి.

"రా నాయినా! రారా!!" పెద్దరెడ్డి భార్య గొంతులోని మార్దవానికి ఆగిపోయాడు.

ఆమె ఆప్యాయతముందు అసహనాన్ని కప్పిపుచ్చుకొంటూ లోపలికి నడిచాడు.

బియ్యం బేళ్లున్న సంచిని అతనిముందుంచింది ఆమె.

మోసేంత గుమ్మడికాయ ఇచ్చింది.

అంతలో- పెద్దరెడ్డి నాన్న కర్రవూతేసుకొంటూ అక్కడికి వచ్చాడు. "ఒరే అబ్బీ! సిన్నోనివయినా బోపనిమంతునివిరా!" అన్నాడు జానకి మొహంలోకి చూస్తూ.

"ఈ మంచాన్ని సూస్తాంటే నా పెండ్లిరోజులు గుర్తొస్తాండయిరా నాయినా! మీ ముదెబ్బ వుండేటోడు. గొర్రు గుంటకలు కడ్తూనే నాజూకు పనులుగూడా సేసేటోడు. ఆ మాసి సేతి వాటం జూసినా! యిన్నేండ్లకు మల్లా నిన్ను జూస్తావుండా..." ఆయన గొంతులో తన్మయత్వపు తడి జీరవోయింది.

జానకి నొసలు అప్రయత్నంగానే ముడివడ్డాయి. ఆయనకేసి వింతగా చూశాడు.

అబ్బురంగా చూశాడు.


తన మంచంలోని పనితనాన్నంతా పోగేసి అరచేతిలో పెట్టుకొని ఛుంబించినంత ముచ్చటగా చూశాడు.

"ఆ అద్దాలూ... ఆ గిలకలూ... కొత్త కాపురానికి యిట్లాంటి మంచం... అనుబవానికొస్తేగాని ఆ సుగం తెల్దునాయినా!.." చిన్నగా గొణుక్కొంటూ కళ్ల నీళ్లబుకుతోండగా అనుభూతుల కుప్పలా కదిలాడు.

అప్పటిదాకా స్థంభాన్ని ఆనుకొని నిల్చుని వున్న నవవధువు బుగ్గల్లో పొటమరించిన ఎర్రదనం శరీరమంతా పాకి కదిలే గులాబి మొగ్గల్లా అక్కణ్నించి జారుకొంది.

ఆ దృశ్యపు చివరి అంకం జానకి కళ్లబడింది.

నిద్రలేమివల్ల ఒళ్లంతా ఆవరించిన అలసట చేత్తో తుడిచినట్లుగా మాయమైంది అతనికి.




పెద్దిరెడ్డి అహంకారంవల్ల తనకు కలిగిన మానసిక క్షోభ ఆవిరి అయినట్లుగా అనిపించింది.

పనితనం హృదయానికి సంబంధించినదిగా ఉండటమే సహజమనిపించింది.

బైటకు నడుస్తూ పెద్దిరెడ్డి కేసిచూశాడు.

పెద్దాయన చెప్పినట్లు- హృదయానికి సంబంధించిన ఏ అనుభవాల స్పందనలూ లేని రాతిమనిషిలా కనిపించి చిన్నగా నవ్వుకొన్నాడు.

ఆయన శరీరానికి సరిపోయేది చట్టుబండల అరుగే.

గిలకల మంచాలమీద అనుభవాల్ని ఆస్వాదించే తనువులు ఇంటి లోపలున్నాయి.

ముసలితనపు ముడుతల్లోంచి ఉబికి వచ్చిన మధురస్మృతుల తన్మయీ భావమూ, పడుచుదనపు బుగ్గల్లోంచి పొంగి వచ్చిన మధురోహల సిగ్గరితనమూ పరిమళ వాయుతరంగాలై తన వూపిరులకేసి అలలుఅలలుగా తోసుకొస్తూ తన్నంతా కమ్ముకొంటూ వుండగా మెల్లిగా తన శిల్పారామంకేసి సాగాడు జానకిరామయ్య. ●